క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం



తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథివర్మ మాట్లాడుతూ లారెన్స్, మైకో సంస్థల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశామని, సుమారు 270 మంది విద్యార్థులు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. డ్రైవర్లకు కంటిపరీక్షలు చేసి సమగ్ర నివేదికలు అందజేశారన్నారు. కార్యక్రమంలో ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూతురమ్య, హాబీ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ సుభాకర్ రాజు, వైఆర్‌సి ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ సుప్రియ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు రోడ్డుపాలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట పంప్ హౌస్ నుంచి వెళ్లే పైపులైన్ మంగళవారం పగలడంతో తాగునీరు వృథాగా పోతోంది. అది గమనించిన పంప్‌హౌస్ సిబ్బంది తాత్కాలికంగా నీటి సరఫరాను నిలిపివేశారు. నులకపేట రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న పంప్‌హౌస్ నుంచి కృష్ణనగర్ పాత పంచాయితీ ఏరియాలోని పలు ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తారు. భారీ వాహనాలు తిరగడంతో పైప్‌కు ఒత్తిడి తగిలి పగిలిపోవడంతో పాత జాతీయ రహదారిపై తాగునీరు వృథాగా పోతోంది.

'సాంకేతిక'తో లక్ష్య దిశగా..



మేడికొండూరు: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని లక్ష్య దిశగా ముందుకెళ్లాలని ఫాదర్ బాలస్వామి చెప్పారు. డోకిపర్రు అడ్డరోడ్డు సమీపంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల ఇంటర్నేషనల్ స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ ప్రిన్సిపాల్ ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఇష్టపడి కష్టంతో ముందుకు సాగితే సత్ఫలితాలు వస్తాయన్నారు.విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. పలు ప్రాంతాలకు చెందిన 43 సంస్థల టీములు పాల్గొన్నారు. నవీన పద్ధతుల్లో ఎదురయ్యే ఆధునిక విధాన సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను విద్యార్థులకు వివరించారు. వివిధ విభాగాల అధిపతులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకొండూరులో పొలం బడి

దుగ్గిరాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు, రాత్రి వేళల్లో తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో వరి పైరుపై చీడ పురుగులు, కీటకాలు ఎక్కువ ఉంటున్నాయని ఏఓ ఆర్.విజయబాబు అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం పెదకొండూరులో రైతులతో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు వరిపైరుపై ఆకు చుట్టు పురుగు, నల్లి వంటి చీడ పరుగులు ఆశిస్తున్నట్లు గమనించామని వాటి నివారణకు పంటపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, బాలచంద్రశేఖర్, ప్రశాంత్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు కట్టించుకోవాలి



మేడికొండూరు: మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి వారి సమస్యల పరిష్కారానికి మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక, అది కట్టకపోతే పరీక్ష ఫీజు కట్టించుకోబోమని కళాశాల యాజమాన్యం చెబుతోందని దీన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. 2024–25లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6,400 కోట్లు ఇవ్వకుండా ప్రభుత్వం ప్రచారం చేస్తోందని చెప్పారు. పరీక్ష ఫీజు కట్టించుకోకపోవడం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైనా కాలేజీ యాజమాన్యం నిర్ణయం మార్చుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్, ఇతర నేతలు పాల్గొన్నారు.



మంగళగిరి కనకదుర్గ ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు



శివాలయంలో గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



కాళీమాత ఆలయంలో శ్రీ గాయత్రీదేవి అలంకారంలో ..

పంచముఖి ప్రణమామ్యహం

శోభాయమానం.. శరన్నవరాత్రి ఉత్సవాలు

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. రెండవరోజు మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో అమ్మవారి అలంకారాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాత మంగళగిరి దుర్గ నగర్ బైపాస్ వెంబడి ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారు మంగళవారం గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గంగాభ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో..

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు మంగళవారం గజలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈఓ గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గౌతమ బుద్ధ రోడ్ రాజీవ్ గృహకల్ప రోడ్డు వెంట ఉన్న శ్రీ కాళీమాత ఆలయంలో అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి, రూరల్ పరిధిలోని వివిధ దేవాలయాల్లో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రులు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. తాడేపల్లి శ్రీ గంగా బాలత్రిపుర సుందరీదేవి శ్రీ రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని శ్రీ గాయత్రీదేవిగా అలంకరించారు. ఉండవల్లి రెడ్ల రామమందిరంలో శ్రీగాయత్రిదేవి అలకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం సుహాసిని, కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరు మహంకాళీ దేవస్థానంలో, దుగ్గిరాల గంగా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లను గాయత్రిదేవి గా అలంకంరించారు .

విజయకీలాద్రిపై


తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనములతో ఈనెల 23వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి అమ్మవారికి ఉదయం 9 గంటలకు తిరుమంజనం, అలంకారం, భక్తులతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పల్లకి సేవ, అర్చన జరిగాయని పేర్కొన్నారు.



ప్రత్యేక అలంకారంలో మహాలక్ష్మి



తాడేపల్లిలో శ్రీ గాయత్రి అలంకారంలో అమ్మవారు



ఉండవల్లిలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



రెడ్ల రామమందిరంలో శ్రీ గాయత్రి అలంకారంలో..



గోతులమయం కంతేరు ప్రధాన రహదారి

తాడికొండ నుంచి కంతేరు వెళ్లే ప్రధాన రహదారి గోతులమయమై వాహనచోదకులను ఇబ్బందులకు గురి చేస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మార్జిన్లు కోతకు గురయ్యాయి. గోతులు అగాధాల్లా మారాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించిన దాఖలాలు లేకపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా వారు స్పందించాల్సి ఉంది.

–తాడికొండ

● తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా రామ అప్పలనాయుడు

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా జె.రామ అప్పలనాయుడును నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈయన శ్రీకాకుళం జిల్లా రాజం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై తెనాలి వస్తున్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు రేవేంద్రపాడు విద్యార్థులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంటీఎంసీ పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో అండర్ 17 విభాగంలో పాఠశాల విద్యార్థులు ఎం. ఆకాష్, బి. శివ కోటేశ్వరరావు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పీడీఎం సూర్యప్రకాశరావు, గ్రామస్తులు, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు తదితరులు విద్యార్థులను అభినందించారు.



ఆకాష్



శివకోటేశ్వరరావు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

తెనాలిఅర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎంహెచ్ఓ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం సలహా సంఘ సమావేశాన్ని మంగళవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లేబొరేటరీల్లో లింగ నిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటలు చేయకూడదని సూచించారు. అలాగే లింగనిర్ధారణ కూడా జరపకూడదన్నారు. లింగ నిర్ధారణ చేస్తే.. వారికి మూడు సంవత్సరాలు జైలు, రూ.50వేలు జరిమానా విధించడంతో పాటు భారత వైద్య మండలి ధ్రువపత్రాన్ని ఐదు సంవత్సరాలు రద్దు చేయడం జరుగుతుందన్నారు. లింగనిర్ధారణ జరపం అనే బోర్డులను కూడా వైద్యశాలల్లో, స్కానింగ్ సెంటర్‌లలో ఏర్పాటు చేయాలన్నారు. సభ్యులు డాక్టర్ నరేంద్రసింగ్, డాక్టర్ కె.సురేష్, డాక్టర్ వినిల్, డాక్టర్ వేముల ప్రియాంక్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ముమ్మనేని భానుమతి, పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

అంగన్‌వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

తెనాలిటౌన్: డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి అభ్యర్థులకు మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కమిటీ వైస్ చైర్మన్ సబ్ కలెక్టర్ సంజనా సింహా, సభ్యులు మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసన్న, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం డివిజన్‌లోని 53 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. త్వరలో ఫలితాలు విడుదల చేస్తామని వెల్లడించారు. తెనాలి సీడీపీవో పి.విజయగౌరి, ప్రత్తిపాడు సీడీపీవో విజయలక్ష్మి, మంగళగిరి సీడీపీవో సరిత పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

దుగ్గిరాల: మహిళలు ఆరోగ్యంగా ఉండాలని పేరుకలపూడి గ్రామ సర్పంచి గంపల గంగాధర్ అన్నారు. స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ మంగళవారం దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈమని పీహెచ్‌సీ డాక్టర్ ఎ.శ్రీవల్లి మాట్లాడుతూ ఒకే చోట అన్ని రకాల సేవలు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేక వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, చిన్న పిల్లలకు టీకాలు, వైద్య అవగాహన, రక్తహీనత, క్షయ గుర్తింపు పరీక్షలు, బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు రక్తదానం, అవయవదానం, ఆడవారికి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మొత్తం 65 మంది సేవలు పొందారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గొలుసు దొంగతనానికి యత్నం

● మహిళల ప్రతిఘటన ● బైక్‌పై చైన్‌స్నాచర్ల పరార్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్ ఎస్‌బీఐ ఎదురు రోడ్డులో మహిళ మెడలో చైన్ లాగే ప్రయత్నం చేయగా ఆ మహిళ ప్రతిఘటించడంతో సదరు వ్యక్తులు పారిపోయినట్లు మంగళవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం ముగ్గురు మహిళలు విజయవాడలోని కనకదుర్గ దర్శనానికి వెళ్లి సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నారు. ఉండవల్లి ఎస్‌బీఐ వద్ద ద్విచక్ర వాహనంపై తెల్లచొక్కాలు ధరించి ఇద్దరు యువకులు ఉన్నారు. ఈ మహిళలు ముగ్గురూ బ్యాంక్ ఎదురు వీధిలోకి వెళ్లగానే వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి ఒక మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే ఆ మహిళ గట్టిగా కేకలు వేయడంతో పక్కనే ఉన్న ఇద్దరు మహిళలు పెద్దపెద్దగా కేకలు వేస్తూ ముగ్గురూ బైక్‌పై ఉన్నవారిని ప్రతిఘటించారు. దీంతో చైన్ స్నాచర్లు ద్విచక్ర వాహనంపై అతివేగంగా పారిపోయారు. ఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు మహిళల బంధువులు తెలిపారు. చైన్ స్నాచింగ్ జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం గదుల ప్రారంభం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, ఆంధ్రాప్యారిస్ రోటరీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నవీకరించిన అంగన్‌వాడీ కేంద్రం స్టోర్ రూమ్, వంటగదిని మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన స్టోర్ రూమ్, వంటగది నిర్వహణకు గల ఇబ్బందులను తెలియజేయటంతో రోటరీ సభ్యులు ఇచ్చిన రూ.50 వేల విరాళంతో ఆయా గదులను నవీకరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ విజయగౌరీ, సూపర్‌వైజర్ కొడాలి సౌజన్య సమక్షంలో రోటరీ బాధ్యులు వీటిని ప్రారంభించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్ పాల్గొన్నారు. రోటరీ క్లబ్ సేవల్లోని ప్రాథమిక విద్య, అక్షరాస్యత కార్యక్రమాల్లో భాగంగా ఈ సేవను చేపట్టినట్టు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ చెప్పారు. సహకరించిన సభ్యులకు క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. హ్యాపీ స్కూల్స్ డైరెక్టర్ బత్తుల వెంకటేశ్వరరావు డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ అతిథులుగా హాజరయ్యారు.



ప్రారంభిస్తున్న రోటరీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు

పొలాలు మునగకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

తాడేపల్లి రూరల్: పంట పొలాలు నీట మునగకుండా శాశ్వతపరిష్కారం చూపాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం, కొలనుకొండ, గుడిమెడ, కుంచనపల్లి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వడ్డేశ్వరం నుంచి గుడిమెడ వైపు వెళ్లే కట్ట రోడ్డు వద్ద రైతుల పంటపొలాలు నీట మునిగాయన్నారు. చిన్నపాటి వర్షం కురిసినా పంటపొలాలు నీట మునిగే పరిస్థితి నెలకొందన్నారు. పంటపొలాల్లో కాలువ పూడుకుపోవడం, సంబంధిత వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ఈ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కేఎల్‌యూ యాజమాన్యం పొలాల డ్రైనేజీ కాలువకు అడ్డుకట్ట వేయడంతో రైతుల పంటపొలాలు నీట మునుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కానుగోలు కోటయ్య, కేవీపీఎస్ మండల నాయకులు నాగపోగు విజయరాజు, తెలుగు రైతు సంఘం నాయకులు కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, చిగురుపాటి సుబ్బారావు, కాసరనేని అంకినీడు పాల్గొన్నారు.



పంటపొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని రత్నాలచెరువు, లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ, పావురాల కాలనీల్లో మంగళవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఫీవర్ సర్వే చేయాలని, జ్వరాల బారిన పడిన వారికి వెంటనే వైద్యం అందించాలని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను ఆదేశించారు. రోజూ తాగునీటి పైపులైన్లను తనిఖీలు చేసి లీక్‌లను అరికట్టాలని, తాగునీటి శాంపిల్స్ సుమారు 50కి తగ్గకుండా సేకరించాలన్నారు. నమూనాలను పరీక్షించి 100 శాతం నాణ్యతతో కూడిన తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ప్రసన్న జ్యోతి, వార్డు అడ్మిన్ కార్యదర్శులు, వార్డు హెల్త్ కార్యదర్శులు, శానిటేషన్ కార్యదర్శులు, ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సేకరించిన నీటి నమూనాలను పరిశీలిస్తున్న ఏడీసీ శకుంతల

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ నేత వేముల దుర్గారావు, యూనియన్ నేత షేక్ సుభాని, డి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 294వ రోజుకు చేరుకుందని, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ వీరికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం. గురవయ్య, అంకయ్య, రమాదేవి, ఇమాంబి, దుర్గాభవాని, సారమ్మ, నాగేశ్వరరావు, సువర్ణకుమారి, నవనీతం, దేవరాజు, కాసమ్మ పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న నాయకులు

విద్యార్థులకు అభినందన

ఫిరంగిపురం: గుంటూరు బీఆర్ స్టేడియంలో ఈ నెల 20న నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17, అండర్–19 ఊషూ పోటీల్లో ఫిరంగిపురం డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయం సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.మేరి మంగళవారం తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కళాశాల నుంచి అండర్–19కు కె.సంధ్యారాణి, వై.లక్ష్మీలావణ్య, డి.కీర్తన, కె.అఖిల్, అండర్–17కు జె.కారుణ్య, కె.సమైఖ్య, ఎ.అనూష, కె.దిలీప్, కె.అఖిల్‌తేజ్‌లు రాష్ట్రస్థాయి ఊషూపోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం వారిని అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఎం.కిరణ్‌కుమార్, పీడీ జె.చంద్రశేఖర్, డి.అనూరాధ, విద్యార్థులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్ కె.మేరి